క్లుప్తంగా

ఘనంగా కేఎల్ రావు జయంతి


కేఎల్ రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో పద్మభూషణ్ డాక్టర్ కేఎల్ రావు 122వ జయంతిని ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేఎల్ రావు విగ్రహానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ దేవ ప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో ఉన్న అనేక కట్టడాలకు స్ఫూర్తిగా నిలిచిన కేఎల్ రావు ఆశయాల సాధనకు పునరంకితం కావాలని అన్నారు. చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ పులిచింతల ప్రాజెక్టుకు కేఎల్‌రావు పేరుని పెట్టారని గుర్తు చేశారు. ఇంజినీర్లు యేటి అర్జున్, బొట్టా శ్రీనివాస్, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు, ఉపాధ్యక్షుడు నోరి శ్రీనివాస్, జేఈలు, టెక్నికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రి మహోత్సవాలు


వారాహి మాత అలంకరణలో సౌభాగ్యలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈనెల 6వ తేదీన ప్రారంభమైన శ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం శ్రీచక్ర అభిషేకం చేసి అనంతరం సహస్రనామార్చన చేశారు. అమ్మవారికి వారాహి మాతగా అలంకరించారు. ఈ సందర్భంగా చండీ సహిత లలితా హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల నుంచి భక్తులచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి పంచహారతులు సమర్పించారు. అనంతరం వేద మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

హుండీ ఆదాయం రూ.89 వేలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మ దేవస్థానంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. గత ఏప్రిల్ 25 నుంచి ఇప్పటి వరకు అమ్మవారికి హుండీల ద్వారా రూ.89,923 ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి మీసాల వెంకటరావు ఆధ్వర్యంలో హుండీల ఆదాయాన్ని లెక్కించగా, ఆర్ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మతాలకు అతీతంగా మొహర్రం

- మొక్కులు తీర్చుకుంటున్న హిందూ, ముస్లింలు
- అగ్ని గుండం తొక్కే కార్యక్రమం
- 15 పంజాల్లో నిత్యం ప్రత్యేక ప్రార్థనలు
- రేపు పీర్ల నిమజ్జనంతో మొహర్రం ముగింపు


పోణంగిలోని బీబీ ఫాతిమా హజరత్ మౌలాలి పంజాలో ప్రార్థనలు


ఏలూరు చేపల చెట్టు సెంటర్‌లోని సింగమహల్లా పంజా


గన్ బజారులోని జల్‌జలా సాహెబ్ ఆస్థాన


ఇమామే ఖాసిం పంజా


కుండీ సెంటర్‌లోని గొలుసుల పంజా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అమర వీరుల నెల (షహీద్)గా నిర్వహించే మొహర్రం నెలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ప్రజలంతా సోదరభావంతో మెలుగుతూ క్షేమంగా, సుఖ శాంతులతో, ఆరోగ్య, ఐశ్వర్యాలతో జీవించాలని కోరుతూ మొహర్రం కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఏలూరు నగరంలో గత కొన్ని దశాబ్దాలుగా కొన్ని పంజాల్లో మాత్రమే నిర్వహిస్తూ వస్తోన్న మొహర్రం కార్యక్రమాలను ఈ ఏడాది నూతనంగా ఏర్పడిన పీర్ల పంజా కమిటీ కొన్ని పేద పంజాలు (ఆస్థానాలు)లకు ఆర్థిక సాయం చేస్తూ దాదాపు అన్ని ఆస్థానాల్లోనూ ప్రార్థనలు నిర్వహించేలా సహకారమందించింది. దీంతో ఈ ఏడాది ఆయా ఆస్థానాలకు కొత్త కళ వచ్చింది.

పీర్ల ప్రతిష్ఠ

మొహర్రం సందర్భంగా నగరంలోని వివిధ ఆస్థానాల్లో పీర్ల ప్రతిష్ఠ చేశారు. అప్పటి వరకూ పెట్టెల్లో భద్రంగా దాచిన వెండి, ఇత్తడి తదితర లోహాలతో తయారు చేసిన పీర్లను పెట్టెల్లో నుంచి బయటకు తీసి వాటికి మెరుగులు దిద్ది అత్యంత సుందరంగా పూలతో అలంకరించి ప్రతిష్ఠ చేశారు. ఈ ప్రతిష్ఠా కార్యక్రమం గత 7, 8 తేదీల్లో ఆయా ఆస్థానాల్లో నిర్వహించారు. నాటి నుంచి నిత్యం భక్తులు పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. పిల్లలు పుట్టని వారు పీర్ల వద్ద పూల అలంకారం చేసి మరమరాలు, అటుకులు, శనగపప్పు, బూందీతో చేసే ప్రసాదాన్ని నైవేద్యంగా పెడితే పిల్లలు పుడతారనే నమ్మకంతో హిందువులు సైతం ఈ తరహా నైవేద్యం ఆయా ఆస్థానాల్లో చేస్తున్నారు. అలాగే పిల్లలు పుట్టిన వారు తమ కోరికలు నెరవేరడంతో మహాత్ముల పీర్లకు వెండి ఊయలలు, హస్తాలు సమర్పిస్తున్నారు.

అగ్ని గుండం తొక్కే కార్యక్రమం

మొహర్రం వేడుకల్లో అగ్నిగుండం తొక్కే కార్యక్రమం ప్రధానంగా భావిస్తారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత పవిత్ర కార్యంగా భావించి ఎంతోమంది నిప్పుల గుండాన్ని తొక్కుతారు. నగరంలోని గన్ బజారు జల్ జలా సాహెబ్ ఆస్థాన, పోణంగిలోని మౌలాలి ఆస్థానలో ఈ నిప్పుల గుండాన్ని తొక్కే కార్యక్రమం ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. కాగా పోణంగిలో సోమవారం రాత్రి నిప్పుల గుండం తొక్కగా, గన్ బజారులో సోమవారం రాత్రి, మంగళవారం రాత్రి కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

15 ఆస్థానాల్లో ప్రార్థనలు

ఏలూరు పరిసర ప్రాంతాల్లోని 15 ఆస్థానాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా ప్రతి నిత్యం ప్రత్యేక ప్రార్థనలు, దరూదె సలాం, ఫాతెహాఖానీ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కుండీ సెంటర్‌లోని మౌలాలి పంజా, గన్‌బజారులోని జల్ జలా సాహెబ్ ఆస్థానలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఇమామ్ ఏ ఖాసిం పంజా, సింగమహల్లా పంజా, లతీఫ్ తికియా ఖాదర్ జండా పంజా, అబ్బాస్ అలీ పంజా, బీబీ ఫాతిమా పంజా, ఇమామ్ ఖాసిం పంజా, గాజుల పంజా, ఏడు కాలువల సెంటర్ పంజా తదితర పంజాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.

పీర్ల నిమజ్జనంతో ముగింపు

ఏలూరు, పరిసర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన పీర్లను రేపు అంటే ఈ నెల 17వ తేదీన పండుగను పురస్కరించుకుని నిమజ్జనం చేయడంతో మొహర్రం పూర్తవుతుంది. దీని కోసం పీర్ల పంజా కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం మధ్యాహ్నం నుంచి ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన పీర్లను విశేషంగా అలంకరించి స్థానిక కుండీ సెంటర్‌లోని గొలుసుల పంజా వద్దకు తీసుకొస్తారు. అక్కడి నుంచి భారీ ఊరేగింపుగా బయలుదేరి నగర వీధుల్లో భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఊరేగింపు సాయంత్రానికి పాత బస్టాండు వద్ద ఉన్న కర్బలా మైదానానికి చేరుతుంది. అక్కడ పీర్లను నిమజ్జనం చేస్తారు.

ఆర్ఐఓపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి ఫిర్యాదు చేసినట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కాకి నాని తెలిపారు. తాడేపల్లిగూడెం, ఏలూరు నగరం శాంతినగర్‌లోని శశి కాలేజీల యాజమాన్యంపై ఫిర్యాదులు చేశామని, వీటిపై అలసత్వం వహిస్తున్న ఆర్ఐఓ చంద్రశేఖర్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో ఎస్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి బహూకరణ


క్రీడా సామగ్రిని అందజేస్తున్న వెలమాటి చంద్రశేఖర్ జనార్దనరావు

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాలకు క్రీడా సామగ్రిని అందజేసిన దాత వెలమాటి చంద్రశేఖర్ జనార్దనరావును హెచ్‌ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ, గ్రామ పెద్దలు గుత్తా రాజా, కసుకుర్తి రామకృష్ణ, చిట్టి బాబు అభినందించారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన దాత చంద్రశేఖర్ జనార్దనరావు రూ.1.5 లక్షల విలువైన క్రీడా సామగ్రిని పాఠశాలలో హెచ్‌ఎంకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర


రథయాత్రలో మహిళల కోలాటం


నగరంలో జగన్నాథుని రథయాత్ర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నగరంలో రెండోసారి జగన్నాథ రథయాత్ర సోమవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక లునాని పార్కు వద్ద ఉన్న ఇస్కాన్ మందిరం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే బడేటి చంటి ఈ యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి శనివారపు పేట కాజ్‌వే మీదుగా అశోక్ నగర్, పత్తేబాద రైతుబజారు, ఆర్ఆర్ పేట మెయిన్ రోడ్డు, ఫైర్ స్టేషన్ సెంటర్, ఒన్‌టౌన్, మెయిన్ బజారు మీదుగా రామకోటి ప్రాంగణానికి యాత్ర చేరుకుంది. యాత్ర వందలాది మంది భక్తులు నృత్యాలు, కీర్తనలతో, గానాలతో, కోలాట ప్రదర్శనలతో నగర వీధుల్లో ఆనందోత్సాహాల మధ్య సాగింది. సాయంత్రం 6.30 గంటల నుంచి రామకోటి ప్రాంగణంలో స్వామి వారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం సమర్పించారు. జగన్నాథ ప్రవచనం, భక్తులందరికీ జగన్నాథ ప్రసాద విందు పంపిణీ చేశారు.


రథాన్ని భక్తిపారవశ్యంతో లాగుతున్న భక్తులు

సామర్థ్యాలను నైపుణ్యాలుగా మార్చుకోవాలి


విద్యార్థిని ఏకపాత్రాభినయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పుట్టుకతో మనలో ఉండే సామర్థ్యాలను అవకాశం వచ్చినప్పుడు నైపుణ్యాలుగా మార్చుకోవాలని సెయింట్ థెరిస్సా కళాశాల పీజీ డైరెక్టర్ సిస్టర్ సుశీల పిలుపునిచ్చారు. ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవాన్ని సోమవారం కళాశాలలో నిర్వహించారు. యువతలోని నైపుణ్యాలను వెలికితీయడానికి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. యువతకు ఉపాధి, నైపుణ్యాలను సమకూర్చుకోవడం, సమాజంలో సవాళ్లను ఎదుర్కొనే విధంగా తయారు చేయడమే ఈ పోటీల ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నృత్యం, సంగీతం, హాస్య వల్లరి, కవితా రచన, మెహందీ, కేశాలంకరణ, ఏకపాత్రాభినయం అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకురాలు కళ్యాణి, కామర్స్ విభాగాధిపతి సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు జగదీశ్వరి, హారిక, లావణ్య పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ వైపు వినియోగదారుల చూపు



జూట్‌మిల్లు సెంటర్‌లో కౌంటర్ ఎదుట సిమ్‌ల కోసం వేచి ఉన్న వినియోగదారులు

ఏలూరు (టూటౌన్): ఇటీవల ప్రైవేట్ టెలికాం సంస్థలు తమ టారీఫ్‌లను పెంచిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి వినియోగదారులు ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌లోకి మారేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీనికి బీఎస్ఎన్ఎల్ సిమ్ కౌంటర్‌ల వద్ద వినియోగదారులు సోమవారం క్యూ కట్టడమే నిదర్శనం. ఇతర కంపెనీల సెల్ నెంబర్లను పోర్టబిలిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌లోకి మార్చుకుంటున్నారు. దీంతో నెట్ వర్క్ మాత్రమే మారుతుంది. వినియోగదారులు గతంలో వినియోగించిన సెల్ నెంబర్ యథాతథంగా ఉంటుంది. గత కొన్ని రోజులుగా బీఎస్ఎన్‌లోకి మారేందుకు వినియోగదారులు వస్తున్నట్టు ఏలూరు నగరంలోని పలువురు ఫ్రాంచైజీల నిర్వాహకులు, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది చెబుతున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	17
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	05

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	58	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	10, 12
బెండకాయలు	24	కంద	50
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-56	కీరా దోస	50
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	34	అల్లం	170
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36-52	పాలకూర	12
దొండకాయలు	38	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	60	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	44

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

గణపవరం: బాల్యవివాహాలు చేయడం సామాజిక దురాచారమే కాక చట్టరీత్యా నేరమని, ఈ విషయాన్ని గ్రామాల్లో ప్రజలకు వివరించాలని గణపవరం ఐసీడీఎస్ సీడీపీవో టి.లక్ష్మీసరస్వతి అన్నారు. సోమవారం గణపవరం తహసీల్దార్ కార్యాలయంలో కొత్త చట్టాలపై బాల్య వివాహాల నిరోధక కమిటీ మండల స్థాయి అధికారులు, వీఆర్వోలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత కారణంగా చట్టాలపై అవగాహన లేక బాల్య వివాహాలు చేస్తున్నారని అన్నారు. బాల్య వివాహాలు చేస్తే వరుడికి ఏడు సంవత్సరాల జైలుశిక్ష, తల్లిదండ్రులకు రెండేళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని వివరించారు. కొత్తగా మూడు న్యాయ చట్టాలు భారతీయ న్యాయ సాహిత్య- 2023 మైనర్ బాలికలపై అత్యాచార చట్టం, ఉద్యోగినులపై వేధింపుల చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం అమలులో ఉన్నాయని తెలిపారు.

నాయకుల విగ్రహాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్


చల్లచింతలపూడి మహాత్మాగాంధీ, డాక్టర్ వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

దెందులూరు: చల్లచింతలపూడిలో బస్టాండ్ సెంటరు వద్ద మహాత్మా గాంధీ, డాక్టర్ వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని విద్యుత్ శాఖ ఏడీఈ ఎస్ త్రివాస్‌కు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. సోమవారం చల్లచింతలపూడిలో బస్టాండ్ సెంటరు వద్ద నాయకుల విగ్రహాల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు, ప్రయాణికులకు, విగ్రహాల వద్దకు వెళ్లిన వారికి ప్రమాదం పొంచి ఉందని గ్రామ మాజీ సర్పంచ్ ఎం.మోహనరావు, నాయకులు వేమన రాము తదితరులు వివరించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రమాదంలేని చోటుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని ఏడీఈ ఎస్.త్రివాస్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ నాయకుల విగ్రహాల మధ్య నుంచి ట్రాన్స్‌ఫార్మర్లను తొలగిస్తామన్నారు.

వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెదవేగి : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు సూచించారు. సోమవారం పెదవేగి మండలం వెంకటకృష్ణాపురంలో పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ మాధవి సూచనల మేరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే, దోమలు లార్వా పెరిగే స్థలాలను గుర్తించి వాటిని నాశనం చేయడం కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాపించే డెంగీ, మలేరియా, టైఫాయిడ్, నీళ్ల విరేచనాలు, కామెర్లు తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాప్తికి కారణమైన దోమలు మంచినీటి నిలువ ప్రాంతాలైన నీళ్ల తొట్టెలు, నీళ్ల కుండీలు, డ్రమ్ములు, వాడేసిన కొబ్బరి బొండాలు టైర్లు, పూలకుండీలు, రుబ్బు రోలు, ఎయిర్ కూలర్లు, ఫ్రిజ్ వెనుక బాక్సు తదితర ప్రాంతాల్లో పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి ఫ్రైడే- డ్రై డే ఆచరించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపం వల్ల టైఫాయిడ్, కామెర్లు సంక్రమిస్తాయన్నారు. భోజనానికి ముందు చేతులు పరిశుభ్రపరచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, అనారోగ్య సమస్యను గుర్తించి అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. పెదవేగి, గోపన్నపాలెంలోని ఆరోగ్య కేంద్రాల్లో అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.రోజ్ మేరీ , హెల్త్ సూపర్‌వైజర్ రమేష్, హెల్త్ అసిస్టెంట్లు మేక శ్రీనివాసరావు, రమేష్ బాబు, ప్రసాద్, విజయవర్ధన్ పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై ఆరా

సాక్షి స్పందన


భీమడోలులో ఆరోగ్య సమస్యలపై ఆరా తీస్తున్న ఈవోఆర్డీ

భీమడోలు: సాక్షిలో ఈనెల 14న శనివారం ప్రచురితమైన హడలెత్తిస్తున్న అతిసారం శీర్షికన ప్రచురితమైన కథనంపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించారు. భీమడోలు, పోలసానిపల్లి, పూళ్ల తదితర గ్రామాల్లో విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరి డిశ్చార్జి అయిన రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. మండల పంచాయతీరాజ్ విస్తరణాధికారి ఎ.సుందరి ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశారు. స్టాప్ డయేరియాలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును ఆమె పరిశీలించారు. నీటి పరీక్షలు, రక్షిత నీటి సరఫరా తీరును పర్యవేక్షించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల ప్రజల్లో మరింత చైతన్యం తీసుకుని రావాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య సిబ్బందిపై ఉందని సూచించారు. డయేరియా కేసులు, సీజనల్ వ్యాధులు రాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తతతో ఉండాలని అన్నారు. అలసత్వాన్ని చూపితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. తొలుత భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా, సీజనల్ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారా అని ఈవోఆర్డీ సుందరి ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీతను ఆరా తీశారు. అనంతరం సునీత, వైద్యులతో ఆమె సమావేశాన్ని నిర్వహించి ఆరోగ్య సంబంధ విషయాలపై చర్చించారు. ఆసుపత్రిలో డయేరియా బారిన పడి ఆసుపత్రిలో ఎవరూ చేరలేదని పేర్కొన్నారు. తీసుకున్న ఆహారం జీర్ణం కాక, వయస్సు సమస్యల వల్ల వారికి వాంతులు, విరేచనాలయ్యాయని తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో కోలుకుని వారు ఇళ్లకు వెళ్లారని పేర్కొన్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శులు మడక హేమసుందర్, జయరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.